# ప్రజాపాలనలో దరఖాస్తుల వెల్లువ

గట్టు: ప్రజాపాలన గ్రామ సభల్లో లబ్ధిదారులు పెద్ద ఎత్తున దరఖాస్తులను అధికారులకు అందజేశారు. గట్టు, ఇందువాసి, బోయలగూడెం గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. గట్టులో జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచు ధనలక్ష్మి, ఎంపీటీసీ కృష్ణ, ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం, తహసీల్దార్ ధనుంజయలు దరఖాస్తులను స్వీకరించారు. ఇందువాసి, బోయలగూడెం గ్రామాల్లో వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచులు జీవమ్మ, రాణి, డీప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఎంపీఓ మహేష్‌లు గ్రామసభల్లో దరఖాస్తులను స్వీకరించారు. మూడు గ్రామాల్లో మొత్తం 3,189, మొత్తం 27 గ్రామ పంచాయతీల్లో 14,526 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



గట్టు గ్రామ సభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

### అభివృద్ధి సాధ్యం..


చిన్నపాడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న బండ్ల లక్ష్మిదేవి, నజీమున్నీసా బేగం

ధరూరు: ప్రజా పాలనతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ, ఎంపీపీ నజీమున్నీసా బేగంలు అన్నారు. శనివారం మండలంలోని చిన్నపాడు, నెట్టెంపాడు, నాగర్‌దొడ్డి, పారుచర్ల గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ పరిశీలించారు. చిన్నపాడు 398, నెట్టెంపాడు 592, నాగర్‌దొడ్డి 264, పారుచర్ల 678, మొత్తం 1,932 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ జబ్బార్, ఎంపీఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

### చివరి రోజు 2,264 దరఖాస్తులు

ఉండవెల్లి: మండల కేంద్రం, మెన్నిపాడు చివరి రోజు మొత్తం 2,264 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలో 1,841 దరఖాస్తులు, మెన్నిపాడులో 423 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ వెంకటరావ్, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాపాలన దరఖాస్తులను అందజేస్తున్న అధికారులు

### ముగిసిన గ్రామ సభలు

మల్దకల్: మండలంలోని తాటికుంట, మల్దకల్ గ్రామాల్లో చివరి రోజు ప్రజాపాలన నిర్వహించారు. తాటికుంటలో ఎంపీడీఓ కృష్ణయ్య, మల్దకల్‌లో తహసీల్దార్ హరికృష్ణలు దరఖాస్తులు స్వీకరించారు. రెండు గ్రామాల్లో మొత్తం 3,507 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



తాటికుంటలో దరఖాస్తుల స్వీకరణ

### దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలన


బి.వీరాపురంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్డీఓ చంద్రకళ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీ వీరాపురంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రశాంతంగా ముగిసింది. గ్రామంలో 275 అభయహస్తం, 146 సాధారణ దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కౌంటర్ ఇన్‌చార్జీలు దరఖాస్తులు స్వీకరించారు. ఆర్డీఓ చంద్రకళ ప్రజాపాలన దరఖాస్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసి తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నందిని, ఆర్‌ఐ ప్రశాంత్‌గౌడ్, సర్పంచ్ రాముడు, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

### ప్రజల సౌకర్యార్థమే దరఖాస్తుల స్వీకరణ



ఉమిత్యాలతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కేటీదొడ్డి: ప్రజల సౌకర్యార్థమే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్ అన్నారు. మండలంలోని ఉమిత్యాల, ఉమిత్యాలతండా, మల్లాపురం, మల్లాపురం తండా గ్రామాల్లో శనివారం ప్రజా పాలన గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభల్లో మొత్తం దరఖాస్తులు 1104 వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఆర్‌ఐ ఉదయ్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

### ముగిసిన గ్రామ సభలు

అయిజ: సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు ముగిశాయి. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆఖరి రోజు 389దరఖాస్తులు వచ్చాయి. మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. మొత్తం 8871 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మండలంలోని భూంపురం,



కుటుకనూరులో 248, సింధనూరులో 684, ఉప్పలలో 1372 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సాయిప్రకాష్, తహసీల్దార్ షాహిదాబేగంలు పరిశీలించారు. మొత్తం దరఖాస్తుల సంఖ్య 15,523కు చేరుకుంది.

### ఆస్పత్రి స్థాయిని పెంచాలి

గట్టు: మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి స్థాయిని పెంచాలని రిటైర్డ్ హెడ్మాస్టర్ గోవిందప్ప ప్రజాపాలన గ్రామసభలో ప్రత్యేక అధికారి సుబ్రమణ్యంకు వినతి పత్రం అందజేశారు. మారుమూల ప్రాంతంలో ఆస్పత్రి స్థాయిని పెంచడం ద్వారా వైద్య సేవలు మెరుగు పడి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు ఇంటర్‌తోనే చదువు ఆపేస్తున్నారని తెలిపారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

### స్పెషలాఫీసర్ డుమ్మా

ఉండవెల్లి: మండలంలోని ప్రజాపాలనకు ప్రత్యేకాధికారి డుమ్మా కొట్టారు. స్పెషలాఫీసర్‌గా మిషన్ భగీరథ అధికారి బీమేశ్వర్‌రావ్‌ను నియమించడంతో చుట్టం చూపుగా వచ్చి వెళ్లిపోతున్నట్లు వెల్లడించారు. ఎంపీడీఓ ఉన్నా ఏ గ్రామానికి స్పెషలాఫీసర్ రాలేదని, తహసీల్దార్ వెంకట్రావ్ నాలుగైదు గ్రామాలకు మాత్రమే స్పెషలాఫీసర్ విధులకు హాజరైనట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. అలాంటి అధికారిని ఎందుకు నియమించారని ప్రజలు, నాయకులు ప్రశ్నిస్తున్నారు.

## క్లుప్తంగా

### గురుకులలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధరూరు: తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో 2023–24కు 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (బాలికల) పాఠశాల ప్రిన్సిపాల్ వీ వీణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఈ అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉందని, ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని వారు కోరారు.

### ఇంటింటికీ రాముడి అక్షతలు



కేటీదొడ్డి: ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షతలు చేరాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంతో పాటు కొండాపురం, నందిన్నె, వెంకటాపురం. తదితర గ్రామాల్లోని అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షతలను శనివారం కేటీదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ వీధుల్లో శోభాయాత్రతో ఇంటింటికీ అక్షతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఉన్నారు.

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు, తక్కశిల, ప్రాగటూరు గ్రామాలలో రాములవారి అక్షతలను భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. మేళతాళాలు, భజనలతో అక్షతలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

### నేడు లక్ష్మి వర్ధంతిసభ

గద్వాల అర్బన్: సమస్యలపై రాజీలేని పోరాటం చేసి 2005లో హత్యకు గురైన కర్నూల్ జిల్లా పాములపాడు మండలం మద్దురు గ్రామానికి చెందిన లక్ష్మి వర్ధంతి సభను ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో నిర్వహించనున్నట్లు చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలు సృజన, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుబాన్, చైతన్య మహిళా సంఘం నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### తిరుమలలో బింగిదొడ్డి భజన బృందం



అయిజ: మండలంలోని బింగిదొడ్డి దొడ్డిరాయ స్వామి భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానంలో శనివారం అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. దేవస్థాన కమిటీ వారు భజన మండలి సభ్యులను శాలువా, పూలమాలతో సత్కరించారు. భజన మండలి సభ్యులకు ప్రత్యేక దర్శనం చేయించారు.

### ఉర్దూ పాఠశాలలో స్కాఫ్‌ల పంపిణీ



అలంపూర్: అలంపూర్ మున్సిపాలిటీలోని ఉర్దూ పాఠశాలలో తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్కాఫ్, బుర్ఖాలను పంపిణీ చేశారు. తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎంఏ ఖలీల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, షహీనాబేగం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాఫ్‌లను అందజేశారు. ఆయాలకు బుర్ఖాలను పంపిణీ చేశారు. వీరితో పాటు నాయకులు షఫీ అహ్మద్, అబ్దుల్ ముజీబ్, రుక్మద్దీన్, షరీఫ్ ఉన్నారు.

### వాలీబాల్ టోర్నీ ప్రారంభం



గట్టు: మండలంలోని మాచర్లలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి జాతర సందర్భంగా శనివారం వాలీబాల్ టోర్నమెంట్‌ను గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, జెడ్పీటీసీ బాసు శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, సర్పంచు సిద్ధిరామప్పలు ప్రారంభించారు. క్రీడాకారులు స్నేహ పూర్వకంగా పోటీ పడాలని నాయకులు సూచించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాముడు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ అలీ, రాజుగౌడు, ఉరుకుందు, వార్డు సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన ఆదిశిలా క్షేత్రం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం ఆవరణం కిటకిటలాడింది. శనివారం వారాంతపు సంత కావడంతో భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


లక్ష్మీవేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

## క్లస్టర్ పరిధిలో పంటకోత ప్రయోగం పరిశీలన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం వ్యవసాయ క్లస్టర్‌ను శనివారం ప్రణాళిక సంఘం డిప్యూటీ సెక్షన్ అధికారి హైమావతి సందర్శించారు. ఈ సందర్భంగా రైతువేదికను తనిఖీ చేసి చాగాపురం క్లస్టర్‌లో సాగు చేసిన పంటల వివరాలు ఏఈఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుడ్డారెడ్డిపల్లిలో రైతు రామేశ్వరెడ్డి సాగు చేసిన మొక్కజొన్న పొలంలో పంట కోత ప్రయోగంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పొడవు మరియు వెడల్పులో 5మీటర్ల చొప్పున చేసిన మొక్కజొన్న పంట కోత ప్రయోగంలో 25కేజీల వరకు పంట దిగుబడి వచ్చినట్లు ఆమె తెలిపారు. పంటకోత ప్రయోగం ప్రకారంగా ఎకరాకు దాదాపుగా 40 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భరత్, రైతులు ఉన్నారు.


బుడ్డారెడ్డిపల్లిలో పంటకోతను పరిశీలిస్తున్న డీవైసీఓ అధికారి

## పీజీ సెంటర్‌లో ముగ్గుల పోటీలు

గద్వాల: సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని స్థానిక ప్రభుత్వ పీజీ సెంటర్‌లో శనివారం విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీపడి రంగవల్లులు వేశారు. ముగ్గులు పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ చవ్వా వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు అరవింద్, శ్రీనివాసులు, గణేష్, మహేందర్, గోపీనాథ్, నవీన్, గట్టయ్య, రంగారెడ్డి, రఫీ, అభిజ్ఞ, లక్ష్మణాచారి, వేణుగోపాల్ పాల్గొన్నారు.


ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గద్వాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89 పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు శనివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిరకాల మిత్రులు కలిసిన ఆనందం వారిలో కొత్త అనుభూతులు పంచిందని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.

### తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు



గద్వాల అర్బన్: గద్వాల తహసీల్దార్‌గా వెంటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల పాటు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన నరేందర్ ఇటిక్యాల మండలానికి బదిలీపై వెళ్లారు. ఇటిక్యాల మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు బదిలీపై గద్వాలకు వచ్చారు. ఈ సందర్భంగా వారిని డీటీలు, సిబ్బంది పూలమాల, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఝాన్సీ రాణి, ఆర్‌ఐలు వెంకటేశ్వర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

### బ్రిడ్జి పనుల పరిశీలన



అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడు, అయిజ మధ్య ఉన్న వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను శనివారం పంచాయతీ రాజ్ ఏఈ లక్ష్మీనారాయణరెడ్డి పరిశీలించారు. వర్షాకాలం వాగులో పారుతున్న వరద ప్రవాహానికి రాకపోకలు నిలిచిపోతున్నాయని, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. నిర్మాణం పనులు వర్షాకాలం ప్రారంభమయ్యేనాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించాలని సలహాలు, సూచనలు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### బ్రెయిలీ పలకల పంపిణీ

గద్వాలక్రైం: ప్రభుత్వ వైద్యుడి కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంధుల పాఠశాలలో విద్యార్థులకు 25 బ్రెయిలీ పలకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెనీమా, పాఠశాల ప్రినిపాల్, తదితరులు ఉన్నారు.

### లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

వనపర్తి టౌన్: నాలుగేళ్లకే కంటిచూపు కోల్పోయినా.. 17 ఏళ్ల వయస్సులో ప్రొఫెసర్‌గా ఎదిగి అంధులకు అక్షరజ్ఞానం అందించిన ప్రతిభామూర్తి లూయిస్ బ్రెయిలీ అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నివాళులర్పించారు.

### కలెక్టర్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు



గద్వాల న్యూటౌన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ సంతోష్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులుతో పాటు పలువురు నాయకులు కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, రజక నరసింహ, ఓంకార్, నర్సింహ పాల్గొన్నారు.

### బాధితులకు బీమా చెక్ పంపిణీ

మానవపాడు: మండలంలోని పెద్దఆముదాలపాడు గ్రామానికి చెందిన గొల్ల శివన్న కొద్దిరోజుల క్రితం మృతిచెందాడు. బాధిత కుటుంబానికి రూ.5లక్షల రైతు బీమా చెక్‌ను శనివారం ఎమ్మెల్యే విజేయుడు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని, అన్నిరకాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

### ఉర్సు సందర్భంగా కుస్తీ పోటీలు

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాలలో నిర్వహిస్తున్న మీరాసాహెబ్ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా శనివారం అంతర్రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీల్లో 25 మంది పాల్గొనగా హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ మొదటి బహుమతి రూ. 30వేలు, ప్రదీప్ రెండో బహుమతి రూ.25వేలు, ఉత్తప్ప మూడో బహుమతి రూ.20వేలు గెలుచుకున్నా రు. సంగారెడ్డి జిల్లాకు చెందిన రాంశెట్టి నాల్గో బహుమతి రూ.10వేలు గెలుచుకున్నారు.



## తుమ్మిళ్ల నీటిని విడుదల చేయాలని వినతి

రాజోళి: తుమ్మిళ్ల ఎత్తిపోతల నీటిని విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఏఈ సతీష్ కుమార్‌కు విన్నవించారు. శనివారం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద మోటార్లు నిలిచిపోయి ఆర్‌డీఎస్ ఆయకట్టుకు నీరు నిలిచిందని దీని వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు వారు ఏఈ సతీష్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మరో 20 రోజుల పాటు నీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నందున మోటార్లు ఆన్ చేయడం కుదరదని, నీరు ప్రవాహం పెరిగితే మోటార్లు ఆన్ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, ఆశీర్వాదం, మూగెన్న, సీపీఎం నాయకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద కాంగ్రెస్ నాయకులు

## పిల్లల ఎత్తు, బరువు గుర్తించాలి

మానవపాడు: పోషణ్‌మాసంలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో లోప పోషణ పిల్లల ఎత్తు, బరువు గుర్తించాలని జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వాహక అధికారి ముషాహిదాబేగం సూచించారు. శనివారం మండలంలోని జల్లాపురంలో అంగన్‌వాడీ సెంటర్లను ఆమె పరిశీలించారు. బలహీనంగా ఉన్న చిన్నారులకు అదనంగా పోషకాహారాన్ని అందించాలని కోరారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098పై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. గ్రామంలో నర్సరీని పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ ఆస్మా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


గుడ్లు పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వాహక అధికారి ముషాహిదాబేగం

### విద్యుత్ మీటర్ల చార్జి రద్దు చేయండి


విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

అలంపూర్: విద్యుత్ శాఖ రైతులకు అందించిన విద్యుత్ మీటర్ల చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు జీకే ఈదన్న అధికారులను కోరారు. అలంపూర్ చౌరస్తాలోని ఏడీఈ కార్యాలయంలో అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన కాలనీ వాసులతో కలిసి ఈదన్న విద్యుత్ మీటర్ల చార్జీలు రద్దు చేయాలని ఏఈ శరత్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ లైన్‌లోని గత నెల హైటల్టేజీ వల్ల 20 మీటర్లు కాలిపోయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఉచితంగా మీటర్లను అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసకెళ్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సాయన్న, రాజు, రాముడు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

### బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి



ధరూరు: బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని మన్నాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు యోగేందర్ తెలిపారు. శనివారం మన్నాపురంలో బడి బయటి పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా 6నుంచి 19 ఏళ్లలోపు పిల్లలను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యక సర్వే చేయిస్తోందన్నారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి బడి బయటి ప్లిలలు బడిలో చేర్పించేలా మాట్లాడారు. ఉపాధ్యాయులు గజేందర్‌గౌడ్, సీఆర్‌పీ నర్సింహులు ఉన్నారు.